## క్లుప్తంగా...

### పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: నిధులు మంజూరైనా పనుల చేపట్టకుండా ఆలస్యం చేస్తున్న క్రాంటాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కోరారు. నాచారం సెయింట్ పీటర్స్ నుంచి ఇందిరానగర్ శాంతి గార్డెన్ వరకు వర్షపు నీటి పైప్‌లైన్ వేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా అన్నపూర్ణ కాలనీలో రోడ్డు మంజూరైనా క్రాంటాకర్ట్ పనులు చేయడం లేదని, అతడికి నోటీసులు ఇవ్వకుండా అధికారులు ఆలస్యం చేస్తున్నారన్నారు. సాయిజెన్‌శేఖర్ తదితరులు ఉన్నారు.

### అమరుల త్యాగాలను స్మరించుకోవాలి



మట్టి సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

మల్కాజిగిరి: ఢిల్లీలో నిర్మించే అమరుల స్థూపం నిర్మాణం కోసం బీజేపీ చేపట్టిన నేను పుట్టిన నేల – నన్ను కన్న దేశం కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి డివిజన్‌లో సోమవారం మట్టి సేకరణ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకోవడం ధర్మమని, వారి కోసం మట్టి సేకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాంబాబు, వీకే మహేష్, శ్రీనివాస్, సంతోష్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అశ్రునయనాలతో జీడీ శ్రీనివాస్‌గౌడ్ అంత్యక్రియలు



పాడె మోస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టీపీసీసీ డెలిగేట్ జీడీ శ్రీనివాస్‌గౌడ్ అంత్యక్రియలు అశ్రునయనాలతో పూర్తయ్యాయి. 2వ తేదీన ఆయన గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుమార్తె అమెరికా నుంచి రావడంతో సోమవారం అంత్యక్రియలు చేశారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు తదితరులు నివాళులర్పించారు.

### రాష్ట్రస్థాయి ఉత్తమ లెక్చరర్‌గా గోపి



అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కళాశాల లెక్చరర్ డాక్టర్ ఎం.గోపికి రాష్ట్రస్థాయి ఉత్తమ లెక్చరర్ అవార్డు లభించింది. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలలలో పనిచేస్తున్న ఉత్తమ ఆచార్యులు, అధ్యాపకులను ఎంపిక చేసింది. ఈ ఎంపికలో మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న గోపి ఎంపిక కావడంతో కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

### ఎదులాబాద్ సర్పంచ్ సురేశ్ విధుల నుంచి తొలగింపు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామ సర్పంచ్ కాలేరు సురేశ్ విధులు నిర్వహించడంలో విఫలమైనందుకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సర్పంచ్ విధుల నుంచి తొలగించారు. తెలంగాణ పంచాయత్ రాజ్ చట్టం ద్వారా సెక్షన్ 6(3), సెక్షన్(33), సెక్షన్37(2) అనుసరించి పంచాయతీ గ్రామసభలు నిర్ణీత కాలంలో నిర్వహించకపోవడం, కార్యదర్శి ఉషాను అజమాయిషీ చేయడంలో విఫలం అయినందుకు తొలగిస్తున్నట్లు సోమవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. నకిలీ రశీదు బిల్లుల ద్వారా రూ.17,25,502లు పంచాయతీ ఖాతాలో జమ చేయకపోవడం సెక్షన్ 43(5) ఉల్లంగించినందుకు గాను, సెక్షన్51(19) తెలంగాణ పంచాయత్ రాజ్ చట్టం ద్వారా పంచాయతీ కార్యదర్శి ఉషాను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. అలాగే సెక్షన్ 38(1) ప్రకారం ఉప సర్పంచ్ ఉప్పు లింగేశ్వర్‌రావును తాత్కాలికంగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులో తెలిపారు.

# గృహలక్ష్మి వరించేనా..?

- విచారణ ముగిసింది.. అర్హుల లెక్క తేల్చిన అధికారులు
- సామాజిక వర్గాల వారీగా లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు
- ప్రజాప్రతినిధుల ఒత్తిడి.. అధికారుల సతమతం
- జిల్లాలో 17 వేల మంది గృహలక్ష్మి కోసం దరఖాస్తులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: గృహలక్ష్మి పథకం దరఖాస్తుల విచారణ ముగిసింది. మండలాల వారీగా అర్హుల లెక్క తేలింది. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండటంతో అందరి దృష్టి లబ్ధిదారుల ఎంపికపైనే ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 17,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయి విచారణ తర్వాత పురపాలక సంఘాలు, మండలాల వారీగా అర్హుల సంఖ్యను అధికార వర్గాలు తేల్చారు. వాస్తవంగా అర్హుల లెక్క ఆగస్టు 25 వరకు తేల్చాల్సి ఉన్నప్పటికీ, ప్రజాప్రతినిధుల ఒత్తిడి కారణంగా జాప్యమైనట్లు తెలుస్తోంది. ఖాళీ స్థలం ఉన్న పేదలు ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేయనుండటంతో చాలామంది గృహలక్ష్మి పథకంపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఎలాగైనా లబ్ధి పొందాలని ఆశావహులు ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు.

**కేటాయింపు ఇలా..**

ప్రభుత్వం తొలుత ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇళ్లను కేటాయించింది. ఒక్కో నియోజకవర్గానికి 3 వేల చొప్పున మేడ్చల్ జిల్లా పరిధిలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తంగా 15వేల మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూరనుంది. తొలివిడతగా మంజూరు చేసే జాబితాలో చోటు దక్కని వారిని తర్వాత విడతలో మంజూరు చేసేందుకు పరిగణనలోకి తీసుకోనున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

**సామాజిక వర్గాల వారీగా ఎంపిక**

లబ్ధిదారుల ఎంపిక విధానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోనున్నారు. ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇళ్లను కేటాయించిన నేపథ్యంలో ఎస్సీలకు 20 శాతం తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అలాగే ఎస్టీలకు 10 శాతం తగ్గకుండా, బీసీ, మైనార్టీలకు 50 శాతం తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇందులో 5 శాతం దివ్యాంగులకు కేటాయించనున్నారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పురోగతిని బట్టి రూ.3 లక్షలను మూడు దశల్లో ఇవ్వనున్నారు. బేస్మెంట్ దశలో ఒకసారి, పైకప్పు వేశాక రెండోసారి, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మూడోసారి రూ.లక్ష చొప్పున నగదు లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో పడుతుంది.

**ప్రజాప్రతినిధుల ఒత్తిడి..**

గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం పైరవీలు ఊపందుకున్నాయి. వాస్తవానికి గతనెల 25న తొలి జాబితా ప్రకటించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా సర్వే బృందాల క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, ప్రజాప్రతినిధుల ఒత్తిడి వల్ల అమలుకు నోచుకోలేదు. మంజూరైన ఇళ్ల సంఖ్య తక్కువగా ఉండటం, దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో ఉండటంతో జవాబు చెప్పలేక.. ఎన్నికల వేళ ప్రజాప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు.

**అధికారుల సతమతం**

సొంతంగా స్థలం ఉన్నవారు వేలాది మంది దరఖాస్తు చేసుకున్నా వీరిని ఎలా ఎంపిక చేయాలో అర్థం కావడం లేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే సర్వే బృందాల క్షేత్రస్థాయి పరిశీలన ఆగస్టు నెలాఖరులోనే పూర్తి చేసి జాబితాలను నియోజకవర్గ నోడల్ అధికారులకు అందజేశారు. ఇంటింటి సర్వేలో అర్హులుగా గుర్తించిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇక అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టారు. ప్రజాప్రతినిధులు అనుమతి లభించిన తర్వాతే ఎంపికైన లబ్ధిదారుల జాబితాను పురపాలికలు, పంచాయతీల వారీగా ప్రకటించే అవకాశం ఉంది. కాగా దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

## ఉప్పల్ రోడ్డుపై తిప్పలు..

మేడిపల్లి: ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయి. వర్షం కురిస్తే చాలు రోడ్లు జలమయం అవుతున్నాయి. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షానికి రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. రోడ్లపై వరద నీరు నిల్వడంతో వాహనదారులు తిప్పలు పడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పనులను త్వరగా పూర్తి చేయాలని, వెంటనే రోడ్లు వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ పీర్జాదిగూడ అధ్యక్షుడు తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు.



ఉప్పల్-నారపల్లి రోడ్డు దుస్థితి

## మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌కు టికెట్ ఇవ్వాలని వినతి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సుపరిచితుడు ప్రజలను అన్ని విధాలా ఆదుకుని, సమస్యలను పరిష్కరించిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌కు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు సీటు కేటాయించాలని సోమవారం డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు కార్యకర్తలు, నేతలతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వెంకట్రావ్, జగదీష్, నరసింహ, మంగాగౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి



**జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ**

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ కలిసి ప్రజల నుంచి 135 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులకు స్పష్టమైన సమాచారం అందించాలని, సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతితో సహా జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఉప్పల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉప్పల్ డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో దాదాపుగా 70 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వీరంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని, వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈ నెల 11వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయనున్నట్లు వినతి పత్రంలో తెలిపారు.

## ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 28వ డివిజన్ మదర్ థెరిసా కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ దేవాలయానికి సహకారం అందించాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు మంత్రి మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రి మల్లారెడ్డి స్పందిస్తూ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు బాచుపల్లి రమేష్‌చారి, బూడిద వెంకటేష్, మంజుల, రవి, వెంకటేష్, నర్సింహచారి, సురేష్, మహేందర్, మల్లయ్య, సరస్వతి, శ్రీనివాస్, విష్ణు, భాగ్యలక్ష్మీ, చంద్రకళ, లక్ష్మీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం



మెడల్స్, సర్టిఫికెట్లతో అభినందిస్తున్న బొబ్బిలిరెడ్డి

బోడుప్పల్: బెంగళూర్‌లో జరిగిన 'వెస్టర్న్ కప్ జీ4' ఒకటో నేషనల్ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో పోటీల్లో పాల్గొన్న శ్రేయాన్స్ నరిగే బంగారు, వెండి పతకం సాధించినట్లు తైక్వాండో బోర్డ్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి, మాస్టర్ ఎంఆర్ బొబ్బిలి రెడ్డి వెల్లడించారు. చెంగిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతనెలలో జరిగిన మినీ సబ్ జూనియర్ కేటగిరిలో ఒక స్వర్ణం, ఒక రజతం సాధించినట్లు వెల్లడించారు. చిన్న వయస్సులోనే తైక్వాండోలో సత్తాచాటినందుకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి రమేష్ పాల్గొన్నారు.

## డబుల్ ఇళ్లను స్థానికులకూ ఇవ్వాలి

ఘట్‌కేసర్: రెండు పడకల ఇళ్లను స్థానికులకు కేటాయించిన తర్వాతే స్థానికేతరులకు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, హనుమాన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నాయకులు బారీకేడ్లు తప్పించుకొని మంత్రి డౌన్, డౌన్ అంటూ కార్యాలయం ఆవరణలో బైఠాయించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేసేందుకు యత్నించగా అప్పటికే క్యాంప్ కార్యాలయంలో ఉన్న కొందరు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ నాయకులపై దాడికి యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, మోహన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డిని నాచారం పీఎస్‌కు, తిరుమల్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, శివనాయక్, రామతీర్థ, మేడ్చల్, కండ్లకోయ మున్సిపల్ నాయకులను ఘట్‌కేసర్ పీఎస్‌కు తరలించారు. శివనాయక్‌పై దాడి చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేయాలని ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

## ఉపకార వేతనాలు ఇవ్వాలి

**ఏఐవైఎఫ్ జిల్లా సమితి వినతి**

సాక్షి, మేడ్చల్ జిల్లా: యువతకు ఉపాధి అవకాశాల హామీలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, పోటీ పరీక్షల ద్వారా నిరుద్యోగులకు నియామక పత్రాలను కాలయాపన చేయకుండా జారీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర కోరారు. అలాగే, మేడ్చల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల బోధనా రుసుం, ఉపకార వేతన బకాయిలను యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సల్మాన్‌బేగ్, టి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.



## ఐటీఐలో 11న జాబ్‌మేళా

మేడ్చల్: ఈ నెల 11న మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. జాబ్‌మేళాతో పాటు అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పలు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరవుతారని, ఐటీఐ ఉత్తీర్ణత చెందిన యువకులు ఉద్యోగావకాశాల కోసం మేళాకు హాజరు కావాలని ఆమె కోరారు.

## రూ.35 కోట్లతో అభివృద్ధి పనులకు తీర్మానం



కౌన్సిల్ సమావేశంలో మేయర్, కమిషనర్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులను రూ.35 కోట్లతో చేపట్టేందుకు పాలక వర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో సోమవారం మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో 15 అంశాలతో కూడిన అజెండాతో పాలకవర్గం సభ్యులు చర్చించి తీర్మానించారు. ఈ సందర్భంగా మేయర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.4.73 కోట్లు, బీటీ, సీసీ రోడ్ల కోసం రూ.22.65 కోట్లు, పార్కుల ప్రహరీ నిర్మాణం కోసం రూ.90 లక్షలు, పార్కుల్లో గ్రీనరీ అభివృద్ధి కోసం రూ.3.18 కోట్లు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, నిర్వహణ కోసం రూ.4.04 కోట్లు కేటాయించామన్నారు. అలాగే ప్రధాన చెరువులు, ప్రధాన మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేసేందుకు అనువైన ఏజెన్సీ నియామకం కోసం తీర్మానించామన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులకు, శాస్త్రీయ పద్ధతిలో చెత్త సేకరణకు అవసరమైన చర్యలు, పారిశుద్ధ్య విభాగంలో వాహనాల నిర్వహణ కోసం తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## టీంసాయి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ




పేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న సాయిప్రసాద్

అల్వాల్: టీం సాయి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్ అన్నారు. అల్వాల్ సర్కిల్‌లోని లోతుకుంటలోని వే సైడ్ ఫంక్షన్ హాల్‌లో మల్కాజిగిరి నియోజకవర్గం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న చురుకైన, ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థినులకు పైడల్ సే పెడల్ కింద 50 మందిపైగా విద్యార్థులకు సోమవారం టీం సాయి ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా మల్కాజిగిరి నియోజకవర్గంలో టీంసాయి ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి భరోసా ఇస్తూ పేద మహిళలకు కల్యాణ దీవెన కింద ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే టీంసాయి స్పోర్ట్స్ అనే కార్యక్రమం చేపట్టి బడుగు బలహీన వర్గాల వారికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, రవికిరణ్, ఆంథోని, ఆనంద్, అజిత్, సాయి, లావణ, సుజాత, పద్మిని, ప్రతిభ భారతి, టీం సాయి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.5 లక్షల ఉచిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి



బీమా నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మారెడ్డి

మల్లాపూర్: బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా పేదలకు అందిస్తున్న రూ.5 లక్షల ఉచిత బీమాను సద్వినియోగం చేసుకోవాలని బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట కాలనీలో ఇన్సూరెన్స్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకమైన ఆరోగ్యశ్రీ కార్డుతో ఈ పథకంలో రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, బీఆర్‌ఎస్ నేతలు దాసరి కర్ణ, శివకుమార్, అంజి, తుంగ తిరుపతి, రాంచందర్, రమణారెడ్డి, భూపాల్‌రెడ్డి, సుగుణాకర్‌రావు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ఉప్పల్: ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాల్సిన బాధ్యత బీజేపీపై ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప్పల్‌లోని ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌లో పంగ ప్రణయ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దతు మాటలకు, కాగితాలకు పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను విస్మరిస్తే బీజేపీ చారిత్రాత్మక తప్పిదం చేసినట్లు అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణలో బీజేపీ, కాంగ్రెస్‌లు దొందు దొందేనన్నారు. బుధవారం నుంచి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఉద్యమ కార్యచరణలో భాగస్వాములు కావాలని కోరారు. జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, జిల్లా మహిళా నాయకులు సలోని, వడ్డెపల్లి శివ, పోలిపాక అంజయ్య తోకట నరేష్ పాల్గొన్నారు

## ఆకట్టుకుంటున్న 'అవలోక్' శిల్పకళా ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న లయోలా కళాశాల నిర్వాహకులు

అల్వాల్: అల్వాల్ లయోలా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం మల్టీమీడియా అండ్ యానిమేషన్ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన 'అవలోక్' శిల్పకళ, చిత్రకళ డిజిటల్ ఆర్ట్ ప్రదర్శన ఆకట్టుకుంది. దాదాపు 150 మంది విద్యార్థులు 10 రోజుల పాటు శ్రమించి రూపొందించిన విభిన్న ఆకృతులు 70కి పైగా మట్టి శిల్పాలు, 150కి పైగా చిత్రకళ, డిజిటల్ ఆర్ట్ అండ్ పోటరీ ఆర్ట్‌లను ప్రదర్శించారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా రూపొందించారు. జల కాలుష్యానికి వ్యతిరేకంగా అవతార్, ఆక్వామ్యాన్, జలకన్య, టైటానిక్ వంటి ఎన్నో మట్టి శిల్పాలను రూపొందించారు. లయోలా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఫ్రాన్సిస్, యూజీ వైఎస్ ప్రిన్సిపాల్ ఏ.ప్రభు, డీన్ ఆఫ్ ఆర్ట్స్ రత్నావాని, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ఎ.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనను రెండు రోజుల పాటు అల్వాల్ లయోలా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

బోడుప్పల్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని సత్తా చాటినట్లు కరాటే మాస్టర్ నవీన్‌కుమార్ వెల్లడించారు. బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోడుప్పల్‌కు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో పలువురు ఛాంపియన్స్‌గా నిలిచి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు వెల్లడించారు. నేటి సమాజంలో యువతీ యువకులు చదువుతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు లావణ్య, సాయికిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

